# వసంత వలపు

**– కోకా గౌరి**

"ఐ లవ్ యూ" – అన్న ఇంగ్లీషు అక్షరాలు ఆ యింటి గేటు మీద ఆర్చిలా చెక్కి వున్నాయి అందంగా!

తెలుగు నాట పల్లె ప్రాంతంలో ఓ యింటికి అటువంటి పేరు వుండడం గమ్మత్తుగా తోచింది సంతోష్‌కి.

"అయితే ఈ యింట్లో వాళ్ళంతా కూడా లవ్‌లీగా వుంటారేమో" అనుకుంటూ గేటు తోసుకొని లోపలికి అడుగు పెట్టాడు. రంగు రంగుల పూలు 'వుయ్ లవ్ యూ!' అని స్వాగతం పలికాయి. ముగ్ధుడైపోయాడు అతను ఆ పూల సోయగానికి.

"హల్లో! ఎవరు కావాలి?" – అన్న కోకిల కంఠం వినిపించడంతో హృదయం ఒక్కసారిగా జల్లుమంది తనికి.

చామంతి చాయ, లతలా నాజూగ్గా వున్న వొంపు సొంపుల అందాలు గల అమ్మాయి నవ్వుతూ నిలబడి వుంది.

గులాబి రంగు లంగా జాకెట్టు మీద ఆకుపచ్చ ఓణి ధరించి విరిసిన రోజాలా వున్న ఆమెను చూస్తూ వచ్చిన పనే మర్చిపోయాడు సంతోష్.

అంతలో "ఎవరబ్బాయి నువ్వు? సరాసరి యింట్లోకి చొరబడి మా అమ్మాయిని బుట్టలో వేసుకోవాలని చూస్తున్నావ్?" అంటూ తెల్లచీర కట్టుకున్న ముసలమ్మ కంఠం ఖంగుమంది.

గాండ్రుమంటున్న పెద్దపులిని చూసినట్లు అదిరిపడ్డాడు అతను.

వెంటనే ఆ అమ్మాయి "ఎవరో? ఏమిటో తెలుసుకోకుండా ఏమిటీ ఆ మాటలు?" అంది నొచ్చుకుంటూ.

"చాల్లే! నువ్వు పెద్ద చెప్పొచ్చావ్. నోర్మూసుకొని లోపలకు నడు" అని మనుమరాలిని ఒక్క కసురు కసిరి సంతోష్ వైపు చూస్తూ గుడ్లురిమింది.

"చెప్తే నీక్కాదు! యింకా బెల్లం కొట్టిన రాయిలా అలా నిలబడే వున్నావెందుకు? బయటకు నడు, లేకపోతే కుక్కను వదులుతాను, తొడలు కొరుక్కు తింటుంది" కోపంతో కళ్ళెర్రజేసింది.

"బాబోయ్! ఒక్క క్షణం ఆగితే నువ్వే మీదపడి రక్కేలా వున్నావ్ తల్లీ! యింకా కుక్క కూడా ఎందుకు?" అని మనస్సులోనే గొణుక్కొంటూ అక్కడ నుండి బయటపడ్డాడు.



అతను అలా వెళ్ళిపోవటం భరించలేని ఆ అమ్మాయి నాయనమ్మ దగ్గరకు వెళ్ళి "నాయనమ్మా! అతనెవరో తెలుసా?" అంది సీరియస్‌గా.

"ఎవడో జులాయి వెధవ" అంది నిర్లక్ష్యంగా ఆమె.

"కాదు. అతడే – డాడీ నా కోసమని చూసిన అమెరికా పెళ్ళికొడుకు"

"నిజంగా!" అంది నమ్మలేనట్లు ఆమె.

"అవును. అతడే అమెరికాలో ఎలక్ట్రానిక్ ఇంజనీరు చేస్తున్నాడు. ఈ మధ్యే ఇండియా వచ్చాడట విజయవాడ నుండి నన్ను చూద్దామని వచ్చాడు"

"అలాగా! ఎంత పనైపోయింది. వెంటనే వెళ్ళి క్షమాపణ చెప్పి తీసుకురా" అని మనుమరాలిని తొందర చేసింది.

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్న ఆమె గబగబా బయటకు వెళ్ళింది.

అక్కడకు కొద్ది దూరంలో దిక్కు తోచని వాడిలా స్కూటర్ దగ్గర నిలబడి వున్న అతని వద్దకు వెళ్ళి "నా పేరు వసంత. సారీ! మీకు మా నాయనమ్మ చేసిన సన్మానానికి. మీరేదో అవసరం వుండి వచ్చారనుకుంటాను" అంది మర్యాదగా.

"సారీ! నేనే చెప్పాలి. ఎందుకంటే పర్మిషన్ లేకుండా, పరిచయం లేకుండా మీ యింట్లోకి అడుగు పెట్టినందుకు. ఐయామ్ సంతోష్! విజయవాడ నుండి బందరు స్కూటర్ మీద బయలుదేరాను ఒక ఫ్రెండ్‌ను కలవడానికి..." అని చెప్తున్న అతని మాటలకు అడ్డువచ్చి వసంత నవ్వుతూ – "అంతవరకూ రాకెట్‌లా దూసుకు పోతున్న మీ స్కూటర్ సరిగ్గా మా యింటి దగ్గర కొచ్చేసరికి టైరు పంచరై ఆగిపోయింది. టైరు మార్చడానికి మీ దగ్గర టూల్స్‌లేవు. వాటి కోసమే మీరు మా యింటికి వచ్చారు. అవునా!" అంది.

"అరే! కరెక్టుగా చెప్పారు. అందుకే వచ్చాను అని మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నాకేమి దివ్యశక్తులు లేవండి. డాబా మీద నుండి మీ అవస్థ చూస్తూ మీ పరిస్థితి అర్థం చేసుకున్నాను రండి! మీకు కావల్సిన టూల్స్ మా స్కూటర్ డిక్కీలో వున్నాయి. ఇస్తాను"

"అమ్మో! మళ్ళీ మీ యింటికే! వద్దండి బాబూ! మీ నాయనమ్మను తల్చుకుంటే అమెరికా ఆటంబాంబ్ గుర్తు వస్తుంది" అన్నాడు బెదురుగా.

"మరేం భయం లేదు. మా నాయనమ్మకి మంత్రం వేశాను. మిమ్మల్ని యిప్పుడు ఒక వి.ఐ.పి.లా చూస్తుంది. రండి! ప్లీజ్!" అంది.

ఆమె మాటలలోని మాధుర్యానికి కరిగిపోతూ ఆమె వెంట వెళ్ళాడు సంతోష్.

ఈసారి ముసలమ్మగారు సంతోష్‌ను చూస్తూనే "రా! నాయనా! పొరపాటైపోయింది. ముసలి ముండను కదూ! అనుమానం ఎక్కువ. ఏం చేస్తాం! రోజులు అలా వున్నాయి. నువ్వు ఏమీ అనుకోకు నాయనా! యిది మీ స్వంత యిల్లులా భావించుకో!"

"అమ్మా! వసంతా! అబ్బాయిని లోపలకు తీసుకు వెళ్ళు. కాస్త ముఖం కడుక్కుంటాడు. నేను టిఫిన్ అదీ రడీ చేయించి పంపిస్తాను" అని మను మరాలికి ఆజ్ఞాపించి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

"రండీ" అని యింటి లోపలకు ఆహ్వానించింది అతడిని వసంత.

"పర్వాలేదు. నాకు కావల్సినవి యిస్తే నేను నా పని చూసుకొని వెళ్ళిపోతాను"

"చూడండీ! మీకు కావలసిన వస్తువులు కావాలంటే మా నాయనమ్మ చెప్పినట్లు మీరు చెయ్యాలి. లేకపోతే ఆమె మళ్ళీ భద్రకాళీ అవతారం ఎత్తేస్తుంది" అని నవ్వుతూ బెదిరించింది.

సంతోష్ మొహమాటంగానే వాళ్ళింట్లోకి వెళ్ళి ఆమె చెప్పినట్లు ముఖం కడుక్కొని కాఫీ టిఫిన్‌లాంటి అతిథి మర్యాదలు స్వీకరించాడు.

"వెళ్ళొస్తానండి!" అని వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని బయటకు వచ్చేసరికి స్కూటర్ టైరు మార్చి రడీగా వుంది.

కృతజ్ఞతగా వసంత వంక చూశాడు.

ఆమె నవ్వుతూ గేటు వైపు చూసింది. 'ఐ లవ్‌యూ' అన్న అర్చి అతని గుండెలో టార్చిలా వెలిగింది.

అప్పటి నుండి మొదలైంది వారి ప్రేమ కథ.

రోజూ సాయంత్రం అయ్యేసరికి సంతోష్ స్కూటరేసుకొని 'ఐ లవ్ యు'కి వచ్చేస్తున్నాడు.

వారిద్దరి కబుర్లకు కావల్సిన ఏకాంతాన్ని ముసలమ్మగారు కాని ఎవ్వరు గాని డిస్టర్బ్ చేసేవారు కాదు. అలాగని ఎప్పుడూ వారిద్దరూ హద్దులు దాటలేదు.

"వసంతా! మనం రోజు ఎంతసేపు మాట్లాడుకున్నా యింకా ఏదో మాట్లాడుకోవల్సింది మిగిలిపోయినట్లుగా వుంటుంది. ఎందుకంటావ్" అన్నాడు వసంత కళ్ళలోకి ఆర్తిగా చూస్తూ సంతోష్.

"అదే! ప్రియా! ప్రేమంటే!" అంది నవ్వుతూ తీయగా.

ఒకరోజు సాయంత్రం సంతోష్ 'ఐ లవ్ యూ' గేటు తీసుకొని లోపలకు వచ్చేసరికి గుమ్మానికి తాళం కప్ప దర్శనమిచ్చింది. అది చూస్తూనే పామును చూసినట్లు అదిరిపడ్డాడు సంతోష్.

అప్పుడే అక్కడకువచ్చిన తోటమాలి వెంకన్నను చూస్తూ "ఎక్కడకు వెళ్ళారు?" అని అడిగాడు.

"రాత్రి పూరి నుండి అయ్యగారు వచ్చారు. అమ్మగార్కి రేపు తెల్లారితే తిరుపతి కొండ మీద పెండ్లి. అంతా ప్రొద్దునే చిన్నకారులో తిరుపతి వెళ్ళారు అండీ"

సంతోష్‌కి అతడు చెప్పే మాటలు శూలాలై గుండెల్లో గుచ్చుకున్నాయి.

"వసంతా! ఎంత మోసం చేసావ్! యీ ఇంటి పేరు 'ఐ లవ్ యూ' అని అంటే నిజమే అని మురిసిపోయాను. కాదు. నువ్వొక రాక్షసివి! ఈ యింటి పేరు 'ఐ కిల్ యూ' నిజంగానే నన్ను చంపేసావు. ప్రేమ అనే నాటకం ఆడి చంపేసావ్" అని అనుకుంటూ రెక్కలు తెగిన పక్షిలా నిస్సహాయుడిలా నేలకూలాడు. అలా ఆ రాత్రంతా అక్కడే కూర్చుండి పోయాడు మొక్కల మధ్య కూర్చుండిపోయాడు.

తెల్లవారేసరికి ఆ పూలు అతడితో ఏమి బాస చేసాయో గాని అతడి మనస్సు చాలా ప్రశాంతంగా అయిపోయింది.

"వసంతా! నేను నమ్మను. నీ కళ్ళలో ఆ ప్రేమ మోసం చెయ్యదు. నేను నమ్మను. దారిన పోయేవాడ్ని లాలనగా దగ్గరకు తీసి ప్రేమామృతం రుచి చూపించావ్. నీ ప్రేమ అద్భుతం. మన ప్రేమ అమరం. అమరమైన ఆ ప్రేమను పొందిన నేను దురదృష్టవంతుడ్ని కాదు" తెల్లవారేసరికి అతని మనస్సులో నిలిచిన నిర్ణయం అది.

ఆమె లేకపోయినా అతడు రోజూ ఐ లవ్ యూ'కి వస్తున్నాడు. ఆమెతో గడిపిన ఆ మధుర జ్ఞాపకాల నీడలలో రాత్రంతా అక్కడే గడిపి పిచ్చివాడిలా తిరిగి వెళ్ళిపోతున్నాడు.

ఇదంతా గమనిస్తున్న తోటమాలి వెంకన్న "ఎందుకు బాబూ! తమరు ఆమెగారి కోసం యిలా పిచ్చోళ్ళైపోతారు? ఆమె పెళ్ళి చేసుకొని చక్కా వుంది.

మీరు కూడా మంచి సంబంధం చూసి పెళ్ళి చేసుకోండి. ఇక యిక్కడకు తమరు రావద్దు బాబూ!" అని మెల్లిగా నచ్చచెప్పాడు.

"లేదు వెంకన్నా! ఆమే ప్రేమ అబద్ధం కాదు. ఇక్కడకు రాక ముందు నేను ఎందుకు బ్రతుకుతున్నానో నాకు తెలియదు. కాని ఆమెను కలిసాక తెలిసింది ఆమె కోసం, ఆమె ప్రేమ కోసమే బ్రతుకుతున్నానని.

వెంకన్న కళ్ళలో నన్నటి నీటి పొర కదిలింది. "ఏంటో బాబూ! ఈ మాయదారి ప్రేమలు" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

అప్పుడే తూర్పమ్మ తలుపు తట్టి నిలబడ్డాడు సూర్యుడు లోకం తెల్లవారడానికి. నందివర్ధనం చెట్టు నానుకొని వసంత తన చెవిలో చెప్పిన ఆనాటి చిలిపి మాటలు తలపుకు తెచ్చుకుంటున్న సంతోష్ బయట కారు హారన్ మ్రోతకు వులిక్కిపడి కళ్ళు తెరిచి చూశాడు.

బయట టాక్సీ ఆగింది. అందులో నుండి వసంత నాయనమ్మ ఆమె తండ్రి దిగి లోపలకు మెల్లగా వచ్చారు. వాళ్ళను చూస్తూనే సంతోష్ పరుగున వెళ్ళి "వసంత రాలేదా!" అని అడిగాడు.

ఎంత దీనంగా అడిగాడంటే చంటి పిల్లాడు "మా అమ్మ ఏది?" అని కన్న తల్లి కోసం అల్లాడిపోయినంత ఆర్ద్రత వుంది.

వారు సమాధానం చెప్పలేనట్లు తల వంచుకున్నారు. సరిగ్గా అప్పుడే "సంతోష్!" అన్న పిలుపు అతన్ని వుక్కిరి బిక్కిరి చేసింది. మరుక్షణంలో వసంత అతడ్ని లతలా అల్లుకుపోయింది. "నన్ను క్షమించు సంతోష్! మేం ఇద్దరం ప్రేమించుకున్నాం. మాకు పెండ్లి చెయ్యండి అంటే మా డాడీ నిన్ను అనుమానించారు. అందుకే నీకీ ప్రేమ పరీక్ష" అంది వెక్కి వెక్కి ఏడ్చేస్తూ.

"ఓ! ప్రేమికులారా! వర్ధిల్లండి కలకాలం" అని దీవించారు నేనక నుండి పెద్దలు ఆనందంగా.

"ఆడదొంగ"
చందు హర్షవర్ధన్
కొత్త సీరియల్ త్వరలో ప్రారంభం!